పేదల సిలిండర్ల పక్కదారి

- నల్లబజార్‌కు తరలుతున్న సబ్సిడీ సిలిండర్లు
- అధిక మొత్తానికి అమ్ముతున్న వినియోగదారులు
- హోటళ్లు, టిఫిన్ షాపులకు విక్రయం
- పట్టించుకోని అధికారులు



గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న డెలివరీబాయ్,



టిఫెన్ సెంటర్‌లో ఉన్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్

నంద్యాల(అర్బన్): గృహ అవసరాలకు ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న గ్యాస్ సిలెండర్లు పక్కదారి పడుతున్నాయి. ఇళ్లలో వినియోగించాల్సిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, రొట్టెల బండ్లు, బజ్జీ బండ్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో దర్శనమిస్తున్నాయి. కొంత మంది గ్యాస్ వినియోగదారులు సిలిండర్లను ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ముగ్గురున్న కుటుంబానికి 2 సిలిండర్లు వినియోగం మాత్రమే ఉండటంతో అటువంటి వారిని ఎంపిక చేసుకుని వ్యాపారులు వారి పేరుపై గ్యాస్ బుక్ చేసుకొని ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వంట గ్యాస్ దుర్వినియోగం నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని నిబంధనలు పెట్టినా అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రతి కుటుంబానికి ఒక గ్యాస్ సిలిండర్ కనెక్షన్ ఉండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా సబ్సిడీ గ్యాస్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దీపం పథకం ద్వారా కొంతమంది అధికార పలుకుబడితో ఒక్కో కుటుంబంలోనే ఇద్దరు, ముగ్గురు కనెక్షన్లు పొందినట్లు సమాచారం.

పెరుగుతున్న సిలిండర్ ధరలు

గ్యాస్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలకు ఏ యేటికి ఆయేడు పెంచుతూ పోతోంది. 10 ఏళ్ల క్రితం 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.1171కి చేరింది. ధరలతో పాటు వినియోగం కూడా పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెరుగుదలను అమాంతం పెంచుతూ పోతోంది. దీనికి కారణం డొమెస్టిక్ సిలిండర్లను ఇతర అవసరాలకు వినియోగించడమేనని పలువురు భావిస్తున్నారు. అదే విధంగా పదేళ్ల క్రితం కమర్షియల్ సిలిండర్ ధర రూ.900 ఉండగా ప్రస్తుతం వాటి ధర రూ.2,215కు పెరిగింది. నంద్యాల పట్టణంతో పాటు గోస్పాడు, శిరివెళ్ల మండలాల్లో 95 వేల కుటుంబాలు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తుండగా 900 కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వ్యాపారులు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించుకుంటూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను పలువురు వ్యాపారులు వినియోగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. రాయితీతో ఇస్తున్న సిలిండర్లను ఇంటి అవసరాలకే వాడాలి. వ్యాపారులు కమర్షియల్ సిలిండర్లు వినియోగించాలి. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వాడటం నేరం. అటువంటి వారిపై తప్పక చర్యలు తీసుకుంటాం.

– ప్రసాదరావు, సీడీఎస్‌డీటీ, నంద్యాల

అధిక మొత్తంలో వినియోగిస్తున్న సిలిండర్

సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌ను వినియోగదారులు సుమారు రూ.1,171 చెల్లించి తర్వాత రూ.200 నుంచి రూ.300 అదనంగా తీసుకుంటూ హోటళ్లు, రెస్టారెంట్లకు విక్రయిస్తున్నారు. సబ్సిడీ సిలిండర్లు పక్కదాని పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని సబ్సిడీ గ్యాస్ పక్కదారి పట్టకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

గ్యాస్‌ను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు



ఒక్కో ఇంటిలో ఇద్దరు, ముగ్గురికి గ్యాస్ కనెక్షన్లు ఉండటంతో ఇంటి యజమాని కనెక్షన్లను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్యాస్ అవసరం లేని కుటుంబాలు నెలవారి కనెక్షన్లను ఇతరులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో సిలిండర్ ధర రూ.1,171 ఉండగా రూ.1,500 నుంచి రూ.1,600 వరకు అమ్ముతున్నారు. దీంతో ఒక్కో సిలిండర్ మీద రూ.300 నుండి రూ.400 మిగులు బాటు అవుతుంది.

– ఏహియా, పోలూరు, నంద్యాల

డొమెస్టిక్ సిలిండర్లే కనిపిస్తున్నాయి



టిఫెన్ సెంటర్లు, బజ్జీల బండ్లు, రొట్టెల సెంటర్లలో డొమెస్టిక్ సిలిండర్లే కనిపిస్తున్నాయి. కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు, డొమెస్టిక్ సిలిండర్ల వినియోగాలను చూస్తూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తగదు. పౌర సరఫరాల అధికారులు గ్యాస్ వినియోగాలపై దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నా వాటి వినియోగాల నియంత్రించలేకపోతున్నారు.

– రవి, విశ్వనగర్, నంద్యాల

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

దొర్నిపాడు: మండలకేంద్రంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరుకానున్న ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శిరివెళ్ల: కోటపాడు గ్రామ సచివాలయంలో నంద్యాల శాంతి రాం హాస్పిటల్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సేవా సమితి డాక్టర్ విజయకుమార్ 253 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

జావీద్ సేవలు మరువలేనివి

నంద్యాల(అర్బన్): ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శిగా జావీద్ చేసిన సేవలు మరువలేనివని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్‌లాల్ అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన జావీద్ సంతాప సభలో ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉంటుందని, ఆరోగ్యం పట్ల ప్రతి విలేకరి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జావీద్ ఈనెల 17న గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మరణం యూనియన్‌కు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, శశిశేఖర్‌శర్మ, అధ్యక్షులు మధు, చలంబాబు, ఉస్మాన్, సాయివర్మ, చల్లా మధు పాల్గొన్నారు.

చెట్లకు నిప్పు..



మంటల ధాటికి మూసుకపోతున్న రోడ్డు



తగలబడుతున్న తాటిచెట్లు

రుద్రవరం: గుర్తుతెలియని దుండగుల దుశ్చర్యకు చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల కేంద్రం నుంచి తెలుగంగ ప్రధాన వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తాటిచెట్లకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడుతున్నాయి. చెట్లతో పాటు వాటిని ఆసాసంగా చేసుకున్న పక్షులు, పాములు, తొండలు తదితర ప్రాణులు మంటల్లో కాలిపోతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్లు



బండను లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో ఉపదేశరామస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర స్థాయిలో ఆరుపండ్ల సైజ్ ఎడ్ల విభాగంలో బండ పందెం నిర్వహించారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 3495 అడుగులతో మొదటి, నంద్యాల జిల్లా నంద్యాల క్రాంతినగర్, గిద్దలూరు బురుజుపల్లెకు చెందిన ఎం భావనరెడ్డి, ఎదురు శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3006 అడుగులతో ద్వితీయ, బేస్తవారిపేట మండలం వంగపాడుకు చెందిన కైపా వెంకట రమణారెడ్డి ఎడ్లు 2944 అడుగులతో తృతీయ, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం నాగయిపల్లెకు చెందిన తవ్వా చంద్రవిజయ్‌కుమార్‌రెడ్డి ఎడ్లు 2876 అడుగులతో నాల్గోవ, కంభం మండలం యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలతానాయుడు ఎడ్లు 2700 అడుగులతో ఐదో స్థానం నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు కొండావారి కుటుంబ సభ్యులు మొదటి, రెండో, మూడో, నాల్గో, ఐదవ బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. వాహనాల రాకపోకల వల్ల కలిగే ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం గాంధీ చౌక్ కూరగాయల మార్కెట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. మార్కెట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన చోట కాకుండా ఇష్టానుసారంగా వ్యాపారాలు చేసుకుంటూ ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, కౌన్సిలర్ అబ్దుల్ మజీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

నాడు–నేడు పనులు పూర్తిచేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: మన బడి నాడు–నేడు పనులు జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఎంఈఓ, ఏపీఎంలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నాడు–నేడు ప్రగతి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద, చిన్న మరమ్మతులు, కిచెన్ షెడ్, రూఫ్ సీలింగ్, టాయిలెట్ల నిర్మాణం,ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్, పాఠశాలకు పెయింటింగ్, ఆకుపచ్చ సుద్ద బోర్డులు తదితర పనులు పూర్తి చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, ప్రహరీలు మినహా మిగిలిన పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఎంఈఓలు, ఏపీఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తమ పరిధిలోని పాఠశాలలను వారానికోసారి సందర్శించి పనుల ప్రగతిని పర్యవేక్షించాలన్నారు. డోన్, బనగానపల్లె, నంద్యాల తదితర మండలాల్లో అధికంగా పనులు మంజూరయ్యాయన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూను తప్పక పాటించి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు వడ్డించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత కోడిగుడ్ల సరఫరాకు సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడాలన్నారు. మండలాల వారీగా గుర్తించిన బడి బయట ఉన్న 1,233 పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో డీఈఓ అనురాధ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్వర్యంలో శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలన్నారు.

హైజనిక్ కిట్ల పంపిణీ

శ్రీశైలం ప్రాజెక్ట్: స్థానిక కాలనీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీశైలం బ్రాంచ్ యూనిట్ ఆధ్వర్యంలో హైజనిక్ కిట్లు పంపిణీ చేశారు. మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్ అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సొసైటీ బ్రాంచ్ చైర్మెన్ నాగేషు, సభ్యులు భాస్కర్, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లికార్జున, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

పాములపాడు: మండల కేంద్రం భారత్ పెట్రోల్ బంకు వద్ద ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మహ్మద్‌వలికి స్వల్పగాయాలయ్యాయి. కర్నూలు వన్‌టౌన్ ఏరియాకు చెందిన ఓనర్, కమ్ డ్రైవర్ మహ్మద్‌వలి మామిడి పండ్ల లోడుతూ ఆత్మకూరుకు వెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణంలో కేజీ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయాడు. ఈ క్రమంలో ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. చుట్టు పక్కల వారు వెంటనే ఆటోలో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రైతు ఆత్మహత్య

నందికొట్కూరు: బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఎస్‌ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. కురువ చంద్ర (55) తనకున్న 4.20 ఎకరాలు సొంత పొలంలో పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేశాడు. కుటుంబ ఖర్చులు, పెట్టుబడుల నిమిత్తం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. రెండు, మూడేళ్ల నుంచి పంట దిగుబడులు అంతంత మాత్రమే రావడంతో నష్టాల బారిన పడ్డాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో గురువారం అర్ధరాత్రి కల్లంలో చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం అటువైపు వెళ్లిన కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోలుకోలేక వలంటీర్ మృతి

మహానంది: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వలంటీర్ మనోహర్(38) కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందాడు. బొల్లవరంలో 14వ క్లస్టర్‌లో వలంటీర్‌గా పనిచేస్తున్న మనోహర్ తన చిన్నకుమారుడు షణ్ముఖ శ్రీనివాస్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 23వ తేదీన బొల్లవరం నుంచి నంద్యాలకు వెళ్తుండగా రాళ్లవాగు సమీపంలో కుక్కలు అడ్డురావడంతో తప్పించబోయిన బైక్ చెట్టును ఢీకొంది. దీంతో మనోహర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రసన్నతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బస్సు- లారీ ఢీ

బండిఆత్మకూరు: పార్నపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు లారీ –బస్సు ఒకదానికొటి ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. అయితే, బస్సు, లారీ పాక్షికంగా దెబ్బతిన్నాయి.

5న బండలాగుడు పోటీలు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మే 5వ తేదీన రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈపోటీల్లో పాల్గొనే దలచిన వారు వివరాలకు 8008663446, 6303354390, 9908888224, 9441808624 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. అలాగే ఏబీఎం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో మే 1 వ తేదీన క్రికెట్ పోటీలు జరుగనున్నాయి.

క్రీడాదుస్తుల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ క్రీడాకారులకు పాఠశాల హెచ్‌ఎం సక్రూనాయక్, జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామ వీఆర్‌ఏ మహ్మద్‌రఫీ (42) గుండె నొప్పితో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ బాబు, సర్వేయర్ భాస్కర్, వివిధ గ్రామాల వీఆర్‌ఏలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.15,000 అందజేశారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మండలాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం



మాట్లాడుతున్న శెట్టి ప్రభాకర్

నంద్యాల(రూరల్): అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఓబులేసు సభ దృష్టికి తీసుకురాగా తహసీల్దార్ శ్రీనివాసులు స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామన్నారు. స్థలాలు ఉన్నప్పటికీ ఇళ్లు నిర్మించుకునేందుకు ఎందుకు నిధులివ్వడం లేదని మునగాల, పసులూరు గ్రామాల ప్రతినిధులు ప్రశ్నించగా ఈ విషయం ఇప్పటికే సంబంధిత అధికారులకు పంపామని హౌసింగ్ ఏఈ వర్మ సమాధానమిచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యులు బాషా, ఎంపీడీఓ భాస్కర్, ప్రజాప్రతినిధులు, పంచయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవం...మహానందీశ్వరుడి పల్లకీ ఉత్సవం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పరిసరాలను తిలకించారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేసుకొని వేలాదిమంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. గ్రూప్–1, 2 ఉద్యోగాల సంఖ్యను పెంచి మండలానికి ఒక ఫుడ్‌సేఫ్టీ అధికారిని నియమించాలన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయని పక్షంలో నిరుద్యోగులకు రూ.15 వేల చొప్పున భృతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు విష్ణు, ఎర్రిస్వామి, సురేష్, రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పనిచేసే ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం టార్పాలిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ రవిప్రకాష్ ఉన్నారు.

వాసవీ మాత జయంత్యుత్సవాలు ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి జయంత్యుత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉదయమే పంచామృతాభిషేకాలు, సుప్రభాతసేవలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం అమ్మవారికి సహస్ర గౌరీవ్రతం, 1008 చీరలచే అమ్మవారికి సహస్రార్చన, ఆదివారం జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం, దీపోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నర్సాపురంలో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం నవధాన్యాల సాగు–నేల తల్లి బాగు కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను మండల వ్యవసాయాధికారి జ్యోతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 రకాల విత్తనాలను తొలకరి చినుకులకు ముందుగా పొలంలో చల్లుకొని 60 రోజుల తర్వాత సేద్యం చేస్తే భూ సారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ మహబుబ్‌బాషా, సిబ్బంది హరి, శివశంకర్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలోని 6వ వార్డు జగజ్జననీ నగర్‌లో, 4వ వార్డు కాళికాంబ గుడి వద్ద సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైన్ల నిర్మాణాలకు చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈ మధుకుమార్, కౌన్సిలర్లు తబ్రేస్ సయ్యద్, పురంధర్ మున్సిపల్ పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేను సక్రమంగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి కాంతరావునాయక్

గోస్పాడు: క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వేను సక్రమంగా నిర్వహించాలని వైద్యాధికారి కాంతరావు నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వేను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అన్ని రకాల జాతీయ కార్యక్రమాల లక్ష్యాలు 100 శాతం సాధించాలన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఐరన్ పింక్, బ్లూ మాత్రలు వేసవి సెలవుల్లో ఇళ్ల వద్ద వేసుకోవడానికి పంపిణీ చేయాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఖరీఫ్ పనులకు పొలాలు సిద్ధం



పత్తి కర్రలను కుప్పలుగా పేర్చి కాలుస్తున్న మహిళ

దొర్నిపాడు: రానున్న ఖరీఫ్ సాగుకు రైతులు ఇప్పటి తమ పొలాలనను సిద్ధం చేసుకుంటున్నారు. గత ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటల అవశేషాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు వేసవి దుక్కులు దున్ని, చెత్త చెదారం కుప్పలుగా వేసి కాలుస్తున్నారు. దీంతో వర్షాలకు నేలలు సారవంతం కానున్నాయి. తొలకరి వర్షాలకు రైతులు పత్తి, మినుము, కొర్ర సాగు చేయనున్నారు.